క్లుప్తంగా

వెండి ఆభరణాల సమర్పణ



వెండి ఆభరణాలకు పూజలు చేస్తున్న అర్చకులు, చిత్రంలో దాతలు

రామచంద్రపురం రూరల్: వెల్ల గ్రామంలోని సోమేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయంలో వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీదేవీ భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివార్లకు గ్రామానికి చెందిన ముత్యాల సత్యనారాయణ, పద్మావతి దంపతులు, కొమ్మిరెడ్డి వీర్రాఘవులు, లక్ష్మీనారాయణమ్మ దంపతులు రెండున్నర కేజీల వెండి కిరీటాలు, పాదాలు సమర్పించారు. వాటికి అర్చకులు చావలి సోమేశ్వరరావు, అంగర విజయ వెంకట సూర్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆభరణాలను స్వామి వార్లకు అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎంవీవీ సత్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుల బృందం స్వామిని విశేషంగా అలంకరించింది. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. గ్రామంతో పాటు పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, వెదురుమూడి, తాతపూడి తదితర గ్రామల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామిని దర్శించుకున్నారు.

అర్తమూరులో బ్రహ్మోత్సవాలు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం అర్తమూరులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి 16వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవారి భక్తమండలి చైర్మన్ సత్తి బుల్లిస్వామిరెడ్డి, కన్వీనర్ కర్రి బాపిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి నిత్య పూజలు, లక్ష్మీనరసింహ హోమం, లక్ష తులసి పూజ, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. సత్తి మనీషా మల్లిడి ప్రభావతి జైబోలో శేషకుమారి బృందం వారిచే వెంకటేశ్వర భక్తి గీతాలను ఆలపించారు. అర్చకులకు నూతన వస్త్రాలను సమర్పించారు. స్వామికి 116 కేజీల లడ్డూను సమర్పించారు.

పాల సేకరణ కేంద్రాల్లో పరికరాల ఏర్పాటు



నల్లూరు కేంద్రంలో పాల నాణ్యత పరికరాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కపిలేశ్వరపురం: జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పాల సేకరణ కేంద్రాల్లో శనివారం కంప్యూటరైజ్డ్ పరికరాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రానికి రూ.3 లక్షల విలువైన కంప్యూటరైజ్డ్ పరికరాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి ఇందు మాట్లాడుతూ మండలంలోని 13 గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో కేంద్రానికి రూ.3 లక్షలు చొప్పున 13 కేంద్రాలకు రూ.39 లక్షలు విలువైన కంప్యూటరైజ్డ్ పరికరాలు మంజూరయ్యాయన్నారు. దాదాపు అన్ని కేంద్రాల్లో కంప్యూటర్, మిల్క్ ఎనలైజ్డ్ మిషన్, వెన్న శాతం కొలిచే పరికరాలను అమర్చామని, త్వరితగతిన పాలసేకరణ ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు.

ఆయిల్ పామ్‌పై రైతులకు సదస్సు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవనశాఖ సిబ్బంది

కపిలేశ్వరపురం: ఆయిల్ పామ్ సాగు లాభసాటిగా ఉంటుందని మండల ఉద్యానశాఖాధికారి హెచ్‌ఓ కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని కేదారిలంకలో సర్పంచ్ వీధి వెంకటరెడ్డి అధ్యక్షతన, సర్వేసాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం ఆయిల్ పామ్ సాగు పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, రైతులకు ఆయిల్ పామ్ సాగులో వచ్చే లాభాల గురించి వివరించారు. ఉద్యానశాఖాధికారులు మాట్లాడుతూ ఎకరా విస్తీర్ణంలో 57 మొక్కలు నాటుకోవచ్చన్నారు. ఒక్కో మొక్క ధర రూ.193 కాగా, పూర్తి రాయితీతో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యాన సహాయకురాలు శ్యామల, సర్వేసాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేటు లిమిటెడ్ అసిస్టెంట్ మేనేజర్ బి.వెంకట కృష్ణంరాజు, అసిస్టెంట్ మేనేజర్ యలమాటి శ్రీను, ఉద్యాన రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ



పాలతోడులో ఇంటిపట్టా అందజేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని కాలేరు, అచ్యుతాపురం శివారు సత్యనారాయణపురాల్లో శనివారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కాలేరులో ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. సత్యనారాయణపురంలో సీసీ రహదారిని ప్రారంభించారు. కోరుమిల్లిలో ఎమ్మెల్సీ తోట తనయుడు, యువనేత తోట పృథ్వీరాజ్ చేతుల మీదుగా రిజిస్టర్డ్ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, గ్రామ కమిటీ అధ్యక్షులు ఏలేటి గంగరాజు, పీఏసీఎస్ చైర్మన్ చుండ్రు అమ్మన్న, ఎంపీటీసీ పలివెల మధు, సచివాలయ కన్వీనర్ తాతపూడి విజయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పాలతోడులో ఇళ్ల పట్టాల పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలంలోని పాలతోడు గ్రామంలో పేదలందరికీ ఇళ్లు పథకంలో ప్లాట్లు మంజూరైన లబ్ధిదారులకు రిజిస్టర్ పట్టాలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అందజేశారు. గ్రామంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదలకు అద్దెభారం లేకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్టాలను అందజేసిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, నాయకులు కురుపూడి రాంబాబు, పిల్లా అరవరాజు, తుమ్మా వీరబాబు, పిల్లా సూర్యనారాయణ పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం

కె.గంగవరం: పేదలందరి సొంతింటి కలను సాకారం చేయడమే సీఎం జగన్ లక్ష్యమని సర్పంచ్ మల్లిడి సుశీల అచ్యుత రామయ్య, ఎంపీటీసీ మెండి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు మల్లిడి వెంకట్రావు అన్నారు. మండల పరిధిలోని కోట గ్రామంలో శనివారం లబ్ధిదారులకు రిజిస్టర్డ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు దానం వెంకన్న, అయితేబత్తుల సుబ్రహ్మణ్యం, వీఆర్‌ఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో సీసీ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



కోరుమిల్లిలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న తోట పృథ్వీరాజ్



కోట గ్రామంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న నాయకులు

సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన

- కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్
- రామచంద్రపురంలో పర్యటన

రామచంద్రపురం: సంక్షేమమే ధ్యేయంగా ఐదేళ్లపాటు సువర్ణ పాలన అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని 25వ వార్డు గాంధీనగర్ రామదుర్గా సెంటర్ నుంచి ఇంటింటికీ పర్యటించారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చింతలపాటి శ్రీనివాసరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్య ప్రకాష్ స్థానిక ప్రజలతో మాట్లాడుతూ వారి బాగోగోలు తెలుసుకున్నారు. జగన్ పాలనలో ప్రభుత్వ పథకాలు ప్రజల ఇంటి ముంగిటకే చేరాయన్నారు. కార్యక్రమంలో పట్టణ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి శ్రీధర్, వార్డు కౌన్సిలర్ కోటిపల్లి లక్ష్మీ శివాజీ, వైస్ చైర్మన్లు కొలమూరు శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, వార్డు నాయకులు మట్టా బాబులు, గుమ్మడి బెనర్జీ, సూరంపూడి శీను, పెండ్యాల నాగేశ్వరరావు, గుబ్బల రాంబాబు,గుబ్బల శ్రీనివాస్, వేల్పూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



గొల్లల చెరువులో పథకాలను వివరిస్తున్న కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు

నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ప్రకటించినందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. తనపైనా, తన కుటుంబంపైనా నమ్మకంతో ఎమ్మెల్యే టిక్కెట్‌ను కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. రామచంద్రపురం నుంచి విజయం సాధించి, జగన్‌కు బహుమతిగా అందజేస్తానన్నారు.

మేలు జరిగితేనే ఓటు వేయండి

రామచంద్రపురం రూరల్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందాయని, మీ కుటుంబానికి మేలు జరిగితేనే వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని ఆ పార్టీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ప్రజలను కోరారు. కందులపాలెం శివారు గొల్లలచెరువులో శనివారం ఆయన పర్యటించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పరంగా జరిగిన మేలును వివరిస్తూ, సీఎం వైఎస్ జగన్ రాసిన లేఖలను గ్రామస్తులకు అందించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుత్తుల అచ్యుతవేణి, నాయకులు వైట్ల హరికిషన్, కిస్‌బాబు, పాముల సురేష్, వైట్ల సత్యనారాయణ, స్థానిక పెద్దలు వల్లు సుబ్బారావు, సూరంపూడి అగ్గిరాముడు, కురుపూడి ఏసురత్నం, చిట్టూరి వెంకన్న, పాలిక శ్రీను పాల్గొన్నారు.



రామచంద్రపురంలో పర్యటిస్తున్న సూర్యప్రకాశ్

మంత్రి వేణుగోపాలకృష్ణకు కృతజ్ఞతలు



మంత్రి వేణును సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ కార్యవర్గం

రామచంద్రపురం: రామచంద్రపురంలో జిల్లా అదనపు కోర్టు మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు శనివారం ఆయన స్వగృహంలో రామచంద్రపురం బార్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకట రమణ, వాడ్రేవు సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో, కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు మంత్రిని సత్కరించారు. ఉపాధ్యక్షులు పలివెల సత్యనారాయణ, కోశాధికారి జేఎస్ఎస్ చక్రవర్తి, మహిళా ప్రతినిధి కేవీ సత్యవాణి, జూనియర్ ప్రతినిధి పిల్లా పృథ్వీ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్యశిబిరం



హోమియో మందు వేస్తున్న అతిథులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం అర్తమూరులో శనివారం ఎస్‌బీఎస్ ట్రస్టు ఆధ్వర్యంలో 169వ హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి అందిస్తున్న సేవలను ప్రముఖులు కొనియాడారు. ట్రస్టు డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఎంఎస్‌సీ మాజీ ఉమ్మడి రాష్ట్ర గిడ్డంగిల శాఖ సంస్థల చైర్మన్ మేడపాటి నాగచంద్రారెడ్డి, వీరవెంకటలక్ష్మి చేతుల మీదుగా శిబిరాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రవరం అల్లు రామలింగయ్య హోమియో వైద్య కళాశాల నిపుణులు రోగులను పరీక్షించి మందులను అందజేశారు.

ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలి

కాజులూరు: ఎన్నికల నియమాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని ఎంపీడీఓ ఐ.రత్నరాజు అన్నారు. సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో ఆయన మండలంలోని పలు సచివాలయాలను సందర్శించారు. ఎన్నికల నియమాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయించాలన్నారు.

రామచంద్రపురం రూరల్: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా రామచంద్రపురం, చోడవరం బైపాస్ జంక్షన్‌లో డివిజనల్ ఎన్నికల అధికారి, ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్టింగ్ టీంలు ఎన్నికల విధులు ప్రారంభించాయి. వాహనాలను ఆపి తనిఖీ చేశాయి. కార్యక్రమంలో తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు, ఆర్ఐ కర్రి మహాలక్ష్మి నాయుడు, పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్య సుబ్రహ్మణ్యం, వీఆర్‌ఓ సాయిప్రతిమ, ఎస్సై పి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: తాతపూడి, కపిలేశ్వరపురం, పడమర ఖండ్రిక, అంగర, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, అచ్యుతాపురం, వడ్లమూరు, నిడసనమెట్ట, నల్లూరు, కాలేరు, మాచర, టేకి, కోరుమిల్లి, నాగులచెరువులు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో సంబంధిత అధికారులు చర్యలను ప్రారంభించారు. రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను తొలగించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు.

రాయవరం: ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చిన మరుక్షణం నుంచే అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగించడంతో పాటు, గ్రామాలు, పట్టణాల్లో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు కప్పారు.

కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోడు అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

కపిలేశ్వరపురం: కేదారిలంక, వీధివారిలంక గ్రామాలకు చెందిన 15 మందికి కంటి వెలుగు పథకంలో భాగంగా మంజూరైన కళ్లజోళ్లను సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు శనివారం పంపిణీ చేశారు. వానపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో కంటి పరీక్షలు చేయగా 15 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కళ్లజోళ్లు మంజూరు చేసింది.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

రాయవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో-2 వై.సూర్యనారాయణ సూచించారు. సోమవారం నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్న తరుణంలో శనివారం రాయవరం, చెల్లూరు, పసలపూడి పరీక్షా కేంద్రాల్లో ఇన్విజిలేటర్లతో ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో సూర్యనారాయణ పలు సూచనలు చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాల్సిన బాధ్యత ఇన్విజిలేటర్లపై ఉందన్నారు. ఇన్విజిలేటర్లు శనివారం మధ్యాహ్నం పరీక్షా కేంద్రాల్లో విధుల్లో చేరుతున్నట్లుగా డీఈవో ఇచ్చిన ఉత్తర్వులతో రిపోర్టు చేశారు. అదేవిధంగా చీఫ్, డీవోల పర్యవేక్షణలో పరీక్షా కేంద్రాల్లో బెంచీలపై హాల్ టిక్కెట్లు నంబర్లు కేటాయించారు. రాయవరం మండలంలోని రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు, పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల, చెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాల్లో 812 మంది పరీక్షలు రాయనున్నారు.



పసలపూడి పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్లకు సూచనలు ఇస్తున్న సీఎస్, డీవోలు

ఆమె కోసమే యువకుల ఘర్షణ!

రాయవరం: రాయవరంలో శుక్రవారం రాత్రి జరిగిన కత్తిపోట్ల కలకలం వెనుక ఇద్దరు యువకుల మధ్య ఒక మహిళ కోసం జరిగిన తగాదా కారణమని తెలుస్తోంది. రాయవరం గ్రామానికి చెందిన రోహిత్, బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన శివదుర్గారావుకు మధ్య ఒక మహిళ విషయమై తగాదా చోటు చేసుకుంది. దీనిపై గురువారం వీరిద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకోగా, రోహిత్, అతడి స్నేహితుడు సబ్బెళ్ల మురళీకృష్ణారెడ్డి కలిసి శివదుర్గారావుపై చేయి చేసుకున్నాడు. ఈ విషయాన్ని శివదుర్గారావు తమ్ముడు అభికి తెలిపాడు. మా అన్నపై ఎందుకు చేయి చేసుకున్నావంటూ అభి ఫోన్‌లో రోహిత్‌ను ప్రశ్నించాడు. శివదుర్గారావు ఇదే విషయాన్ని కాకినాడలో ఉన్న భర్నీకుల శ్రీనుకు తెలపగా, అతడు కూడా రోహిత్‌ను ఫోన్‌లో ప్రశ్నించాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి వీరంతా సమావేశమయ్యారు. రాయవరం-కొమరిపాలెం గ్రామాల మధ్య ముందు రోజు జరిగిన గొడవ విషయంపై మాట్లాడుకున్నారు. ఆ సమయంలో శివదుర్గారావు సోదరులైన అజయ్, భర్నీకుల శ్రీను.. రోహిత్‌ను ప్రశ్నించారు. తనను వీరంతా కలసి ఏదో చేస్తారని భయపడిన రోహిత్, అప్పటికే తన వద్ద ఉంచుకున్న చాకుతో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో భర్నీకుల శ్రీను కత్తిపోట్లకు గురయ్యాడు. ప్రస్తుతం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ శ్రీధర్ కుమార్, ఎస్సై జి.నరేష్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. భర్నీకుల శ్రీనుకు సోదరుడైన కోర్ని శివదుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు

మండపేట నియోజకవర్గం



పేరు: తోట త్రిమూర్తులు
హోదా: వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ
విద్యార్హతలు: పదో తరగతి
కుటుంబం: భార్య సూర్యకుమారి, కుమారుడు పృథ్వీరాజ్, కుమార్తె శ్రీలక్ష్మి
రాజకీయ నేపథ్యం: 1994, 1999, 2012, 2014లలో నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యే, 2021 నుంచి ఎమ్మెల్సీ

చేపట్టిన సామాజిక కార్యక్రమాలు

మండపేట పట్టణంలో అదనపు భూమిని సేకరించి డంపింగ్ యార్డును విస్తరింపజేసి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పారిశుధ్య సమస్యను పరిష్కరించారు. ఏటా సంభవించే వరదల సమయంలో వ్యవసాయ క్షేత్రాల్లో చిక్కుకుపోయిన పశువులను రైతులతో పాటు స్వయంగా పంటుపై సురక్షిత ప్రాంతాలకు తరలిస్తుంటారు. ధాన్యం కొనుగోలు తదితర రైతాంగ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి కృషి చేశారు.

రామచంద్రపురం నియోజకవర్గం



పేరు: పిల్లి సూర్యప్రకాశ్
తండ్రి పేరు: పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ రాజ్యసభ, వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్
తల్లి: సత్యనారాయణమ్మ (లేటు)
ప్రస్తుత హోదా : వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్
విద్యార్హతలు : బీటెక్

రాజకీయ నేపథ్యం

తండ్రి సుభాష్ చంద్రబోస్ రామచంద్రపురం నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా చేసి, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. సూర్యప్రకాశ్ తండ్రి వెంట ఉంటూ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచీ పార్టీకి సేవలందిస్తున్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

కె.గంగవరం: మండలంలోని కుందూరు గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు పల్లా నాగకుమార్, కొరిపెల్లి సుబ్రంతో పాటు వారి అనుచరులు.. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికీ బోస్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంగా జగన్ మోహన్ రెడ్డి మంచి పరిపాలన సాగిస్తున్నారని, పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఆయన పాలనకు ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పంపన సత్యానందం, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బత్తుల అప్పారావు, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, మాజీ సర్పంచ్ బత్తుల విజయకుమారి పాల్గొన్నారు.



పల్లా నాగకుమార్‌ను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న పిల్లి బోస్ తదితరులు

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమవుతుందని జెడ్పీటీసీ వనుం వెంకట సుబ్బారావు అన్నారు. శనివారం గొల్లపాలెంలో వైఎస్సార్ సీపీ నేత, మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల గ్రామాలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ పర్యటించారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కలిగిన లబ్ధిని వివరించారు. వెంకట సుబ్బారావు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం జగన్ అనేక పథకాలను రూపొందించి, వాటిని పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే జమ చేస్తున్నారన్నారు. ఎంపీటీసి జొన్నకూటి పద్మజ, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, ఆర్‌ఎంసీ డైరెక్టర్లు నల్లమిల్లి ఈశ్వరరెడ్డి, మాత మురళీ, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకట రమణ, టేకుమూడి దుర్గారావు, చొల్లంగి వెంకన్న పాల్గొన్నారు.



గొల్లపాలెంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు

వైద్య శిబిరాలకు విశేష స్పందన

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో శ్రీముసలమ్మ తల్లి కేర్ క్లబ్, కాకినాడ లయన్స్ క్లబ్ సంయుక్తంగా శనివారం ఏర్పాటు చేసిన నేత్ర, దంత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. స్థానిక శెట్టిబలిజ కల్యాణ మంటపంలో నిర్వహించిన ఈ శిబిరాలను సర్పంచ్ ఆరిఫ్ ప్రారంభించారు. జగ్గంపేట లయన్స్ ఐ హాస్పిటల్ పర్యవేక్షణలో నేత్ర వైద్య శిబిరం, ఉప్పాడకు చెందిన లతా మల్టీ స్పెషాలిటీ సెంటర్ హాస్పిటల్ పర్యవేక్షణలో దంత శిబిరం, కాకినాడ మెడికోవర్ ఆస్పత్రి నేతృత్వంలో జనరల్ శిబిరాలు నిర్వహించారు. సంబంధిత ఆస్పత్రుల డాక్టర్లు వైద్య సేవలు అందించారు. సోమేశ్వరం పరిసర గ్రామాలకు చెందిన 370 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 32 మందికి క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. సుమారు 70న మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. వైద్య శిబిరానికి హాజరైన రోగులకు అన్న సమారాధన నిర్వహించారు. వైద్య శిబిరానికి గుత్తుల సూర్యనారాయణ, లక్ష్మి దంపతులు, కుడిపూడి ఫణితేజ, వాసంశెట్టి జనార్దన్, అమిత్ తదితరులు వైద్య శిబిరానికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ లయన్స్ క్లబ్ రీజినల్ చైర్ పర్సన్ మేడిశెట్టి వెంకట రమణ, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డి.రామసుబ్రహ్మణ్యం, పారిశ్రామికవేత్త గరగ సోమన్న బ్రదర్స్, సోమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ కోట వెంకట్రావు, డాక్టర్ చింతపల్లి వాసు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ ఆరిఫ్

ప్రిన్సిపాల్‌గా రామారావు



ప్రిన్సిపాల్ రామారావును అభినందిస్తున్న సిబ్బంది

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎం.రామారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. రామచంద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితం లెక్చరర్‌గా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల చేరికలపై పూర్తి దృష్టి సారిస్తానని, కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వర్తించి, ఇదే పాఠశాల ఆవరణలోని జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

టీడీపీ అభ్యర్థి సుభాష్ ప్రచారం

రామచంద్రపురం రూరల్: మండలంలోని కందులపాలెంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.